



పాదయాత్రలో డప్పు వాయిస్తున్న కళాకారులు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సొంతింటి కల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 11,785 ఇళ్లు మంజూరు కాగా 5,778 ఇళ్ల గ్రౌండింగ్, 882 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. స్లాబు స్థాయిలో ఉన్న ఇండ్ల పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హౌసింగ్ శాఖ పీడీ కృష్ణయ్య పదవీ విమరణ పొందిన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ముక్రంబాబా, డీఈఓ సయ్యద్ సాజిద్, తాండూరు మునిసిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీఎడ్‌లో వెబ్ ఆప్షన్లకు ఆహ్వానం

వికారాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు డైట్ కళాశాలల్లో వివిధ విడతల్లో జరిగిన అడ్మిషన్ల తర్వాత మిగిలిన సీట్లు, అలాగే ఇటీవల మంజూరైన ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీకి అభ్యర్థుల నుంచి వెబ్ ఆప్షన్లు ఆహ్వానిస్తున్నట్లు డీఈఈ సెట్ కన్వీనర్ రామాచారి తెలిపారు. అభ్యర్థులు ఆగస్టు 2 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 3 నుంచి 5వ తేదీ వరకు వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. గతంలో వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. సీటు రాని అభ్యర్థులు, స్లైడింగ్ కోరుకునే అభ్యర్థులు, ఈడబ్ల్యూఎస్ కోటాకు అర్హత కలిగిన వారు ఆగస్టు 6, 7 తేదీల్లో డైట్ వెబ్‌సైట్‌లో ఆప్షన్లు నమోదు చేయాలన్నారు. రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా ఆగస్టు 11న కన్వీనర్ సీట్లు కేటాయిస్తామని, సీటు పొందిన అభ్యర్థులు టీసీతోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు 11, 12 తేదీల్లో సంబంధిత కళాశాలలో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. స్లైడింగ్ సీటు పొందిన అభ్యర్థులు ఇప్పటికే జాయిన్ అయిన కళాశాల నుంచి హాజరుపత్రిక, రిలీవింగ్ ఆర్డర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని కొత్త కళాశాలలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 77807 40880, 70971 25608 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



రంగాపూర్ వద్ద పాదయాత్రలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, తదితరులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

కాంగ్రెస్ జనహిత పాదయాత్ర మొదటి రోజు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగింది. గురువారం పరిగి నియోజకవర్గంలోని రంగాపూర్ నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ నుంచి భారీ కాన్వాయ్‌తో వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు రంగాపూర్ వద్ద స్థానిక నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో నీరాజనాలు పలికారు. అనంతరం సేవాదళ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను వారు ఆవిష్కరించి జనహిత పాదయాత్రను ప్రారంభించారు.



హారతి పడుతున్న మహిళలు



శ్రేణుల్లో నిండిన జోష్.. మొదటి రోజు విజయవంతం

భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు.. పోలీసుల భారీ బందోబస్తు

పరిగి/రంగారెడ్డి అర్బన్/పూడూరు/దోమ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ నుంచి పరిగి వరకు ఎనిమిది కిలోమీటర్ల దూరం మొదటిరోజు పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో రంగాపూర్, హనుమాన్‌గండి, నజీరాబాద్, పరిగి పట్టణంలో వారికి ఘన స్వాగతం లభించింది. దారిపొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరితో ఒకరు పోటీ పడుతూ ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లాతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ నుంచి భారీగా నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. అప్పా జంక్షన్ నుంచి పరిగి పట్టణం వరకు దారిపొడవునా స్వాగతం పలుకుతూ ఇరువైపులా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు, పార్టీ జెండాలు ఏర్పాటు చేశారు.

పాదయాత్ర కార్యక్రమం సాగిందిలా..

మహేశ్‌కుమార్‌గౌడ్, మీనాక్షీనటరాజన్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు గురువారం రంగాపూర్‌కు

మిగతా 7వ పేజీలో...

ప్రజాహితం కోసమే: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కాంగ్రెస్ చేపడుతున్న జనహిత పాదయాత్ర స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదని.. ప్రజాహితం కోసమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పరిగి చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక ప్రజల్లోకి వెళ్లాలనే ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు చిత్త శుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును తీసుకు వస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నిలిపి వేశారన్నారు. ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు తాగునీటిని అందించే ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

పరిగి నుంచి ప్రారంభించడం సంతోషకరం

» డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

ఎన్నో సత్యాగ్రహాలు, దీక్షలు, ఉద్యమాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని ప్రజలకు తెలియజేసేందుకే టీపీసీసీ.. జనహిత పాదయాత్ర చేపట్టిందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పాదయాత్రను పరిగి నుంచే శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. రాజ్యాంగాన్ని చులకన చేస్తున్న బీజేపీ ఆగడాలను ఎండగట్టేందుకే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఇచ్చిన హామీకి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

ఉపాధ్యాయులకూ ఎఫ్ఆర్ఎస్

నేటి నుంచి ముఖ గుర్తింపు హాజరు

బోధనేతర సిబ్బందికి సైతం అమలు
ఇక అనధికార డుమ్మాలకు చెక్

జిల్లాలో 1,066 ప్రభుత్వ పాఠశాలలు





వికారాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు ఆధారంగా హాజరు(ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్) నమోదు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు విధానం అమలులో ఉండగా ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఉపాధ్యాయులకు, పాఠశాలల్లో పనిచేసే బోధనేతర సిబ్బందికి కూడా ఈ విధానం అమలు కానుంది.

'డీఎస్ఈ - ఎఫ్ఆర్ఎస్'లో వివరాలు

విద్యా శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, టీజీ గురుకుల పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ అమలు కానుంది. జిల్లాలో 1,066 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 19 కేజీబీవీలు, తొమ్మిది మోడల్ స్కూళ్లు, రెండు తెలంగాణ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 4,760 మంది వరకు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది

మిగతా 8వ పేజీలో...



త్వరలో ఆర్వోబీ పనులు?

అయోధ్య చౌరస్తా
రైల్వే గేటు సమస్యకు మోక్షం
రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి
రూ.92.79కోట్లు మంజూరు?
టెండర్ల ఆహ్వానానికి
అధికారుల ఏర్పాట్లు

7

పనిచేయని నిఘా నేత్రాలు

అలంకారప్రాయంగా
సీసీ కెమెరాలు
పట్టించుకోని నిర్వాహకులు

8



లక్ష్యం నెరవేరేనా?

కానరాని 'వన మహోత్సవం'

ఆగస్టు వచ్చినా మొక్కలు నాటని వైనం.. పట్టించుకోని అధికారులు

మేడ్చల్, జూలై 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నది. కానీ, అధికారుల తీరుతో ఈ కార్యక్రమం నత్తనడకన సాగుతున్నది. అసలు జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమం ఉన్నట్టా, లేనట్టా? అనే సందిగ్ధం నెలకొంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు జిల్లాలో కార్యక్రమాన్ని చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

కుల వివక్షను నిర్మూలించాలి

» రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కీసర రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల వివక్షను నిర్మూలించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాల్లో కొంత వరకు కుల వివక్ష తగ్గినా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆలయాల్లోకి రానివ్వకపోవటం, చులకనగా చూడటం వంటి ఘటనలు ఇంకా జరుగుతున్నాయన్నారు. ఈ వివక్షను నిర్మూలించినప్పుడే ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని చెప్పారు. స్థానికుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ, నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, డీవీసీ సభ్యుడు బొట్ల వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో సరదాగా కాసేపు

వారి సమస్యలు తెలుసుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



బార్ అసోసియేసన్ సభ్యులతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ జిల్లా కోర్టును సందర్శించారు. గురువారం బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సరదాగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



కోక కంచె శ్రీరామరక్ష

అడవి జంతువులు, పక్షుల నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొడంగల్ మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామ శివారులో ఓ రైతు సాగు చేసిన పెసర పంటను రక్షించుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. తన పొలం చుట్టూ చీరలను కంచెలా ఏర్పాటు చేశాడు. రాత్రి వేళల్లో గాలి వీచినప్పుడు చీరల నుంచి శబ్దాలు రావడంతో పంట పొలాల వైపు అడవి జంతువులు రావడం లేదని రైతు చెబుతున్నాడు. పెసర, మినప, వరినారు మళ్లకు కోక కంచె శ్రీరామరక్షగా ఉందని తెలిపారు.

-కొడంగల్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మహిళా అభ్యున్నతికి కృషి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, జూలై 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి కృషి చేస్తోందని, అందుకోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ మహిళలకు, మహిళా పారిశ్రామికవేత్తలకు ర్యాంప్(రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్) ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక మహిళలకు 35 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. మహిళలు అనేక రకాల వ్యాపారాలు చేస్తున్నారని, అందులో లాభాలు ఆర్జించడం సంతోషకరమన్నారు. ఈ ప్రోగ్రాంలో ఎంపికైన మహిళలకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సాంబశివరావు, పీడీ మెప్మా విజయలక్ష్మి, సాయిరామ్, జిల్లా స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాలు అజయలక్ష్మి, డీఆర్‌పీ డీఎస్ అమర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాజ్యాధికారమే లక్ష్యం

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థిని నిలుపుతాం
- బీసీ సదస్సులో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


బీసీ రిజర్వేషన్ సాధన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఘట్‌కేసర్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికార సాధనే తన లక్ష్యమని, రానున్నది బీసీల రాజ్యం అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. పోచారం మున్సిపాలిటీ కొర్రెములలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గురువారం బీసీ పొలిటికల్ జేఏసీ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సూదగాని హరిశంకర్‌గౌడ్ ఆధ్యక్షతన నిర్వహించిన బీసీ రిజర్వేషన్ సాధన సదస్సుకు మల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల యుద్ధం మొదలైందని, అందులో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు ముఖ్య భూమిక పోషించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఈ రిజర్వేషన్ల అమలు సీఎం తరం కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది బడుగు బలహీన వర్గాల బిడ్డలు ఆత్మ బలిదానం చేశారన్నారు. ఇప్పుడు బీసీ ఉద్యమంలో ఓసీలు బలిదానం చేసుకొని బీసీలకు రిజర్వేషన్లు సాధించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లో బీసీ పార్టీలే అధికారంలోకి వస్తాయని, అప్పుడు ప్రగతి భవన్, ఎన్టీఆర్(టీడీపీ) భవన్, తెలంగాణ(బీఆర్ఎస్) భవనాలను గుంజుకుంటామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని నిలిపి గెలిపించుకుంటామన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలు సత్తాచాటుతారని తెలిపారు. నెల రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీ జేఏసీలను ఏర్పాటు చేస్తామని, త్వరలోనే పార్టీని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జానయ్యయాదవ్,నారగోని, సూర్యారావు, ఒడేలు, నర్సయ్యగౌడ్, ఇందిర, రజనికుమార్, భావన, కొంటడన్న, రమేష్ పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలి


విరాళం అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి, దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని టాస్క్, సీవీవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సన్మార్గంతోనే దైవానుగ్రహం సంక్రమిస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాల్లో గురువారం పర్యటించారు. కుందారం తండాలో నిర్మిస్తున్న వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రాఘవేందర్‌రెడ్డి తన ఫౌండేషన్ తరఫున రూ. 2.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. మొదటగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డిని ఆలయ నిర్వాహకులు, తండా నాయకులు పూల మాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, తండాలు, గ్రామాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు గన్యానాయక్, సవేందర్, లోక్య, మోతిలాల్, భాగ్య, లోకేశ్, సోమ్లు, శంకర్, నవీన్, సురేశ్, ప్రవీణ్, మహేశ్ పాల్గొన్నారు.

పేదల ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం


రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న క్యామ రాజేశ్, బోసు రవి

కడ్తాల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవం పెంపే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండల అధ్యక్షుడు బోసు రవి అటన్నారు. నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తుందని పేర్కొన్నారు. కడ్తాలలో గురువారం రవి అధ్వర్యంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆహార భద్రత కార్డులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నరు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. అభివృద్ధిలో ప్రజలంతా పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబ, పట్టణాధ్యక్షుడు భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్, మహేశ్, నర్సింహ శ్రీను పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి


కీసరలో మొక్క నాటుతున్న ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి

కీసర, జూలై31(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కీసర రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా కమిషనర్ వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో గురువారం కీసరలో మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషిచేయాలన్నారు. మొక్కలను వృక్షాలుగా మలిచి భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రాజీవ్ యువ వికాసం అందించాలి

- బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ



కేశంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం పథకంలో ఆర్థిక సాయం అందించాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మల్లాంకర్ శివాజీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన గురువారం మాట్లాడారు. నిరుద్యోగ యువత ఉపాధికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తానని ప్రభుత్వం చెప్పిందని వివరించారు. రాజీవ్ యువ వికాసం కింద ఆర్థిక సాయం అందించి దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. జూన్ 2 నుంచి అమలు చేస్తామని పథకం జూలై ముసిగినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలని కోరారు.

పశువుల అపహరణకు వచ్చి
గేదెను చంపిన దొంగలు


తాడు వేసి లాగడంతో మృతిచెందిన గేదె

షాద్‌నగర్ రూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): పశువుల అపహరణకు వచ్చిన దొంగలు గేదె ప్రాణం తీసిన ఘటన షాద్‌నగర్ పరిధి జోగమ్మగూడ శివారులో బుధవారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోటిగూడెం నర్సింలు తన నాలుగు ఆవులు, మరో నాలుగు గేదెలను పొలం వద్ద కట్టేశాడు. అర్ధరాత్రి పశువుల అరుపులు విన్పించడంతో నర్సింలు కొట్టం వద్దకు వెళ్లాడు. దొంగలు అతడిని గమనించి తాము వచ్చిన వాహనంలో పారిపోయారు. కొట్టంలో అప్పటికే గేదె మృతి చెందింది. మెడకు తాడు కట్టి ఉంది. నర్సింలు సమాచారంతో గ్రామస్తులు చేరుకున్నారు. పశువుల దొంగలు జోగమ్మగూడ నుంచి రాయికల్ వైపు వెళ్లినట్లు తెలిపారు. పశువులను అపహరించేందుకు ప్రయత్నించగా అవి చెల్లాచెదురుగా పారిపోవడంతో సాధ్యం కాలేదు. గతంలో రాయికల్‌కు చెందిన పాండు పొలం నుంచి రెండు ఆవులను దొంగలు ఎత్తు కెళ్లారు. కాగా బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'మద్యం పాలసీ ఆమోదం సరి కాదు'

కొడంగల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న మద్యం పాలసీని క్యాబినెట్ ఆమోదించడం సరైంది కాదని సీపీఐ నియోజకవర్గ నాయకుడు జి.సురేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్యంతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతుంటే.. ప్రజాపాలన పేరుతో ప్రజలను మత్తులో ముంచి ఆదాయం దండుకునేందుకు ఇంటికి మద్యాన్ని సరఫరా చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

రిటైర్మెంట్ జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి


డ్రైవర్ ఈశ్వర్‌కు జ్ఞాపికనందించి సత్కరించిన డీపీఆర్వో సిబ్బంది

రంగారెడ్డిఅర్బన్/యాచారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని రంగారెడ్డి డీపీఆర్వో సి.వెంకటేశం అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో డ్రైవర్ ఈశ్వర్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. సిబ్బంది ఆయనకు జ్ఞాపికనందించి శాలువాలు. పూలమాలలతో సత్కరించారు. డీపీఆర్వో మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి బదిలీలు, రిటైర్మెంట్‌లు తప్పనిసరన్నారు. ఈశ్వర్ భవిష్యత్తు జీవితం ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యాలయ సిబ్బంది, యూనియన్ అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, ఈశ్వర్ కుటుంబీకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజమే


ఉద్యోగ విరమణ పొందిన రవీందర్ దంపతులను సన్మానిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, అధికారులు

చేవెళ్ల, జూలై31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదని, అది సహజమేనని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిష్యత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన రవీందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం చేవెళ్లలోని ఈశ్వరి బాంక్వెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను ఎమ్మెల్యే, జెడ్పీసీఈవో, డిప్యూటీ సీఈవో రంగారావు, పలు మండలాల ఎంపీడీవో, ఉద్యోగులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిష్యత్ కార్యాలయంలో అందరితో రవీందర్ మంచి అధికారిగా గుర్తింపు పొందారన్నారు. 35ఏళ్లు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన ఆయన సేవలు గొప్పవని కొనియాడారు. ఉద్యోగ విరమణ తర్వాత శేషజీవితాన్ని ఆరోగ్యంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో హిమబిందు, వెంకటయ్య, ముడిమ్యాల్ ప్యాక్స్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర ఒక దొంగ నాటకం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఇప్పుడు పాదయాత్రతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధికోసమే జనహిత పాదయాత్ర చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రాహుల్‌గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని.. రైతులు, నిరుద్యోగులు విద్యార్థులు, మహిళలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి కానీ, పాదయాత్రలతో ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ ధోరణిగా మారిందని, స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సుప్రీం కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయమై స్పీకర్ 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తెలిపారు. ఫిరాయింపులను నియంత్రించకుంటే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, ప్రజలతీర్పునకు ప్రయోజనం లేకుండాపోయే ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కేశవులు

ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన సాగిస్తోందని, ప్రజల ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లిలో గురువారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రూ.25కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ఖాదర్‌ఖాద్రి, శ్రీనునాయక్, చంద్రయ్య, జానీ పాల్గొన్నారు.



మేస్త్రీలు, కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

బాలల హక్కులను కాపాడాలి

ఇబ్రహీంపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బాలల హక్కులను కాపాడుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఇబ్రహీంపట్నం ఎస్సై రామకృష్ణ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-11లో భాగంగా రాచకొండ మానవ అక్రమ నిరోధక విభాగం, డివిజన్ ముస్కాన్ టీం ఆధ్వర్యంలో గురువారం మంగల్‌పల్లిలోని భవనాల నిర్మాణ ప్రాంతాల్లో మేస్త్రీలు, కూలీలకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. బడీడు పిల్లలు బడుల్లో ఉండాలని, వారిరో పనులు చేయించకూడదని సూచించారు. 14ఏళ్ల వయసులోపు పిల్లలతో పనులు చేయిస్తే నేరమనే విషయం తెలుసుకోవాలన్నారు. చైల్డ్‌లైన్ ఎన్‌జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

- రాజకీయ పార్టీలు డ్రామాలను కట్టిపెట్టాలి
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

తాండూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలన్నీ బీసీ బిల్లు విషయంలో డ్రామాలు ఆపాలనీ, చిత్త శుద్ధి ఉంటే బీసీ బిల్లు అమలు చేయించి, 42శాతం రిజర్వేషన్లను వర్తింపజేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తాండూరులో ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల కోసం రాజకీయ పార్టీలు బీసీ బిల్లును వాడుకుంటున్నాయని పేర్కొన్నారు. బీసీ బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వైఖరి సరిగా లేదని విమర్శించారు. అన్ని పార్టీలు బిల్లు ఆమోదానికి చొరవ చూపాలని, లేకుంటే మరో బీసీ ఉద్యమం తప్పదని పేర్కొన్నారు. 42శాతం రిజర్వేషన్ల బిల్లు అసెబ్లీలో పాసైనా గవర్నర్ ఆమోదం కోసం ఎదురు చూడవలసి వస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు కొర్రీలు పెడుతోందని విమర్శించారు.

ముఖ గుర్తింపుతో పెన్షన్ల పంపిణీ

కొడంగల్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను ముఖ గుర్తింపు యాప్ ద్వారా అందిస్తున్నారు. టేకుల్‌కోడ్‌లో గురువారం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మల్లేశం ప్రభుత్వం రూపొందించిన ముఖ గుర్తింపు ప్రత్యేక యాప్ ద్వారా పెన్షన్లు పంపిణీ చేశారు. గతంలో పెన్షన్‌దారులు బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా పింఛన్లు ఇచ్చేవారు. అయితే కొన్నిసార్లు వేలిముద్రలు ఓకే కాక పెన్షన్ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. టేకుల్‌కోడ్, టేకుల్‌కోడ్ తండా, మోత్కుల బండ తండా, బోయపల్లి తండాలకు వారికి పెన్షన్ అందజేస్తామని తెలిపారు.



ఫేషియల్ రికగ్నిషన్ చేస్తున్న పోస్ట్ మాస్టర్



ఘనంగా భూలక్ష్మీదేవి మహోత్సవాలు

మేడ్చల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని గోసాయిగూడలో గురువారం భూలక్ష్మీదేవి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి పూజలు చేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ పూజలు నిర్వహించారు. స్థానికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



నాయకులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు

(ఐదో పేజీ తరువాయి)

సాయంత్రం 5.35 గంటలకు చేరుకున్నారు. వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 5.50 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర రాత్రి 7.20 గంటలకు కొడంగల్ చౌరస్తాకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మహేశ్ కుమార్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. సమావేశం ముగిసిన తర్వాత అక్కడి నుంచి ఎస్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. అక్కడ కాసేపు పార్టీ నేతలతో మాటామంతి నిర్వహించారు. ముఖ్య నేతలంతా అక్కడే డిన్నర్ ముగించుకొని నిద్రకు ఉపక్రమించారు. పాదయాత్రలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వి.హన్మంత్‌రావు, మధు యాష్కీగౌడ్, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పర్ణికారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జాతీయ యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్‌కుమార్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు నర్సింహారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు రాచమళ్ల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం

పాదయాత్ర రెండో రోజైన నేడు(శుక్రవారం) ఉదయం పరిగి మున్సిపల్ పరిధిలోని గిరిజన బాలికల పాఠశాల/కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ మొక్కలు నాటనున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో పాటు, ఇతర ముఖ్య నేతలు పాల్గొననున్నారు. పది గంటలకు పరిగిలోని ఎస్ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నేతలతో సమావేశం జరగనుంది.



పాదయాత్రలో నాయకులకు రక్షణ వలయంలా ఏర్పడిన పోలీసులు

ట్రాఫిక్ జామ్... వాహనదారుల తిప్పలు

పాదయాత్ర సందర్భంగా పరిగి నుంచి రంగాపూర్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రంగాపూర్ వైపు వాహనాలు వెళ్లకుండా పరిగిలోనే నిలిపివేశారు. కొన్ని వాహనాలను నస్కల్ - వికారాబాద్ మార్గంలో మళ్లించారు. జాతీయ రహదారిపై ఒకవైపు పాదయాత్ర కొనసాగుతుండగా మరోవైపు వాహనాలను అనుమతించారు. పాదయాత్రలో రద్దీ అధికంగా ఉన్న చోట్ల మాత్రం వాహనాలను అనుమతించలేదు. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయంలో రంగాపూర్‌లో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. కాగా, పాదయాత్రలో తోపులాట జరగకుండా పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఎస్పీ నారాయణ రెడ్డి నేతృత్వంలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలతో పాటు పోలీసు సిబ్బందిని భారీగా మొహరించారు.



త్వరలో ఆర్వోబీ పనులు?

- రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ 92.79కోట్లు మంజూరు?
- టెండర్ల ఆహ్వానానికి రైల్వే అధికారుల ఏర్పాట్లు

అయోధ్య చౌరస్తా రైల్వే గేటు సమస్యకు మోక్షం



అయోధ్య చౌరస్తా వద్ద రైల్వే గేటు

మేడ్చల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ అయోధ్య చౌరస్తాలోని రైల్వే లెవల్ క్రాసింగ్ సమస్య పరిష్కారం కానుంది. రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) కట్టాలని ఏళ్లుగా స్థానికులు, వాహనదారులు రైల్వే శాఖను కోరుతున్నారు. రైల్వే గేటు పడితే గంటల తరబడి నిరీక్షించడంతో పాటు రెండు వైపులా కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలుస్తున్నాయి. ఆర్వోబీ నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే శాఖ రూ.92.79కోట్లు(ఎల్‌సీ నంబరు 246ఎ) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఆదేశాలు జారీచేసి రోజులు గడుస్తున్నా రైల్వే అధికారులు మాత్రం ఇంకా ప్రకటించలేదు. కాగా ఆర్వోబీకి నిధులు మంజూరు చేశారని అధికారులు, బీజేపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఆర్వోబీ నిర్మాణంతో వాహనదారుల సమస్య తీరుతుందని స్థానిక బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. గుండ్ల పోచంపల్లి పరిధి ఆయోధ్య చౌరస్తా వద్ద ఉన్న రైల్వే గేటుతో ఏళ్లుగా స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. మేడ్చల్-గండిమైసమ్మ చౌరస్తా రోడ్డులో ఉన్న ఈ రైల్వే గేటు మీదుగా రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి, కండ్లకోయ, సుతారిగూడ, అయోధ్య చౌరస్తా ప్రాంతాల్లో భారీ సంఖ్యలో పరిశ్రమలు, గోడౌన్లు ఉన్నాయి. కాలేజీలు, ఇతర విద్యా సంస్థలూ ఉన్నాయి. ఈ రోడ్డుగుండా వెళ్తున్న వాహనదారులకు రైల్వే గేటు పడుతున్న సమయంలో బాగా ఆలస్యం అవుతోంది. రైళ్ల రాకపోకలు, క్రాసింగ్‌లు, వరుసగా ట్రైన్లు వస్తుంటే గంటల తరబడి రోడ్డుపై నిలిచిపోతున్నారు. వాహనాలు కిక్కిరిసి ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది రైల్వే గేటును తప్పించుకునేందుకు వేరేమార్గాల్లో వెళ్తున్నారు. అలాంటి వారికి దూరాభారం పెరుగుతోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మిస్తారనే వార్త ప్రచారమవుతుండడంతో సంతోషిస్తున్నారు.

పనులు చేపడితే ప్రత్యామ్నాయ మార్గంగా ఔటర్

ఆర్‌ఓబీ పనులు ప్రారంభిస్తే మేడ్చల్-గండిమైసమ్మ మార్గంలో తిరిగే వాహనాలు ఓఆర్‌ఆర్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. మియాపూర్, గండిమైసమ్మ చౌరస్తాల వచ్చే వాహనాలైనా, మేడ్చల్, శామీర్‌పేటల నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్లేవైనా ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే వాహనాల ఎంట్రెన్స్, ఎగ్జిట్లు ఎక్కడ అనేది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఇదిలా ఉంటే ద్విచక్ర వాహనాలకు ఓఆర్‌ఆర్‌పై అనుమతి లేనందున వారు కొంపల్లి, దూలపల్లి మీదగా వెళ్లాలి. మేడ్చల్ వాసులు గిర్మాపూర్, రాయిలాపూర్‌ల మీదగా దుండిగల్, లేదా అయోధ్య చౌరస్తాలకు వెళ్లాల్సి ఉంటుంది. గుండ్లపోచంపల్లి వైపు నుంచి మేడ్చల్ రావాల్సిన ద్విచక్ర, చిన్నపాటి వాహనాలు(కార్లు) అయోధ్య చౌరస్తా వయా రాయలాపూర్ నుంచి చేరుకుంటాయి.

ఫలించిన ఎంపీ ఈటల ప్రయత్నం

ఆర్‌ఓబీ నిర్మించాలని స్థానికులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు పలు మార్లు వినతిపత్రాలను అందజేశారు. ఆయన ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్‌ను కలిసి ప్రజల ఇబ్బందులు, ఆర్వోబీ నిర్మించాల్సిన ఆవశ్యకతపై వివరించి వినతిపత్రాలు ఇచ్చారు. ఇటీవలే ఎంపీ ఈటల రైల్వే శాఖ మంత్రితో ఆర్వోబీపై చర్చించారు. దీంతో మంత్రి దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఆదేశాలు జారీచేయగా వారు నిధులు మంజూరు చేసినట్టు సమాచారం. ఆర్వోబీ పనుల అప్పగింతకు త్వరలోనే టెండర్ కాల్‌ఫర్ చేస్తారని తెలుస్తోంది. పదేళ్లుగా ఈ సమస్య తీవ్రమైంది. ఎంపీ ఈటల ప్రత్యేక దృష్టితో పరిష్కారం కానుందని స్థానిక బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు.



ఎల్లయ్యను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజం

డీసీఎంఎస్ రంగారెడ్డి జిల్లా బిజినెస్ మేనేజర్ రమణారెడ్డి

వికారాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విమరణ ప్రతి ఉద్యోగికి సహజమని, ఉద్యోగ జీవితంలో చేసిన మంచి పనులు ఎప్పటికీ గుర్తుంటాయని డీసీఎంఎస్ రంగారెడ్డి జిల్లా బిజినెస్ మేనేజర్ చొప్పరి రమణారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ చొప్పరి ఎల్లయ్య పదవీ విరమణ సందర్భంగా ఎల్లయ్య, లక్ష్మీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లయ్య కార్యాలయంలో కలుపుగోలుగా ఉంటూ సహచరులతో పనులు చేయించేవారన్నారు. తాండూరు డీసీఎంఎస్‌లో పని చేసే సమయంలో రైతుల వద్ద కొనుగోలు విషయంలో కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారన్నారు. ఉద్యోగంలో మంచి పేరు తెచ్చుకున్న మాదిరిగానే తన శేష జీవితాన్ని కూడా సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొట్టిముక్కుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు నర్సింహారెడ్డి, నర్సింహులు, అరవింద్‌రావు, మునిసిపల్ మాజీ చైర్మన్ అశోక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ గుడిసె లక్ష్మణ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆర్.ఆంజనేయులు, సురేందర్, నాయకులు ఆర్.శ్రీనివాస్, మల్లేశం, పాండు, విఠలయ్య, అనంతయ్య, పర్మయ్య పాల్గొన్నారు.

టీబీపై అవగాహన కలిగి ఉండాలి

కోట్‌పల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): టీబీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ మేఘన అన్నారు. గురువారం రాంపూర్‌లో టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీతో పాటు రక్తపోటు, మధుమేహం, వంటి తదితర వ్యాధుల గురించి వివరించారు. డాక్టర్ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలున్న వారికి ఆరు నెలల వరకు ఉచితంగా మందులు, నెలకు రూ.వెయ్యి ఇస్తామని తెలిపారు. మందులు క్రమం తప్పకుండా వాడాలని గుర్తుచేశారు. 85మందికి ఓపీ చూసి 16మందిని ఎక్స్‌రేల కోసం పంపినట్లు తెలిపారు. 30 మంది స్పూటం శాంపిల్స్ తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖయ్యాం, ఎంఎల్‌ఎచ్‌పీ దివ్య, టీబీ సిబ్బంది అశోక్, రాజేందర్, ఏఎన్ఎం అంజలి, ఆశా వర్కర్లు విజయమ్మ, శోభ, అండాలు పాల్గొన్నారు.

మద్యం తాగుతూ వ్యక్తి మృతి

- కల్తీ మద్యమే కారణమని ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతూ వైన్స్ వద్ద ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండల పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ మండలం అక్కినేనిగూడకు చెందిన సోలిపురం సాయిలు(48) సాయంత్రం కవేలిగూడలోని వైన్స్‌లో మద్యం తాగేందుకు వెళ్లాడు. పర్మిట్ రూంలో మద్యం తాగుతూ పడిపోయి మృతిచెందాడు. దీంతో వైన్స్ యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. అక్కడికి చేరుకున్న సాయిలు కుటుంబీకులు రోదిస్తూ.. కల్తీ మద్యం వల్లే చనిపోయాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. కాగా పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేస్తామని సీఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



మృతుడు సాయిలు

కన్నేసి.. తస్కరించారు

- 15లక్షల నగదు, 16 తులాల బంగారం అపహరణ
- మామిడిపల్లిలో భారీ చోరీ
- ఆలస్యంగా వెలుగులోకి

నందిగామ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మామిడిపల్లిలోని ఓ ఇంట్లో నుంచి దొంగలు గుట్టుగా 15లక్షల నగదు, 16తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లికి చెందిన కృష్ణయ్య భార్య, కూతురితో జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌లో 2ఎకరాల 20గుంటల పొలం ఉండేది. ఆ భూమి 2021లో రూ.66లక్షలకు విక్రయించాడు. ఆ డబ్బులోంచి రూ.30లక్షలతో షాద్‌నగర్‌లో ఓ ప్లాట్ కొన్నాడు. మిగతా డబ్బుతో కూతురి పెళ్లికని 16తులాల బంగారం కొని, రూ.15లక్షల నగదును ఇంట్లో దాచాడు. ఈ నెల 26వ కృష్ణయ్యకు క్రాప్‌లోన్ రూ.50వేలు కట్టాలని బ్యాంక్ నుంచి ఫోన్ రావడంతో డబ్బులు, బంగారం దాచిన సూట్‌కేస్ తెరిచాడు. అందులో ఏమీ కన్పించలేదు. రెండు నెలలుగా తాము సూట్‌కేస్‌ను తెరవలేదని, డబ్బున్న విషయం తెలిసిన వారే అపహరించారని బాధితులు లబోదిబోమంటున్నారు. డబ్బులు, నగలు దొరుకుతాయని ఇరుగుపొరుగు చేప్తే నాలుగు రోజులుగా మాంత్రికుల వద్దకు వెళ్లారు. అదంతా మోసం అని గ్రహించి గురువారం పోలీసులను ఆశ్రయించారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. కూతురి పెళ్లికి దాచిన డబ్బు, నగలు చోరీకి గురవడంతో కృష్ణయ్య దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత కుటుంబం

ఎస్‌బీఐ సేవలను వినియోగించుకోవాలి

- సీజీఎం సహదేవన్‌రాధాకృష్ణన్

మొయినాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలనీ ఎస్‌బీఐ చీఫ్ జనరల్‌మేనేజర్(సీజీఎం-తెలంగాణ) సహదేవన్‌రాధాకృష్ణన్ అన్నారు. గురువారం మండల పరిధి తోలుకట్ట గ్రామంలో ఎస్‌బీఐ-మొయినాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సతీష్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్‌కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. సహదేవన్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన(పీఎంజేడీవై) ఖాతాలతో పాటు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలతో ప్రజలు లబ్ధిపొందాలని సూచించారు. బ్యాంకు రుణాలతో ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి జీవిత బీమా చేయించుకోవాలన్నారు. ఒక వ్యక్తి ఏడాదికి రూ.436 చెల్లిస్తే రెండు లక్షల సాధారణ బీమా వర్తిస్తుందని తెలిపారు. సంవత్సరానికి 20 రూపాయాలు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. 50ఏళ్ల వరకు ఈ బీమా పథకాలు వర్తిస్తాయని చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు ప్రతీ పదేళ్లకు ఒకసారి రీ-కేవైసీ చేయించుకోవాలని, నామినీ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులను కాపాడుకోవాల్సి బాధ్యత ప్రజలదేనని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. కేవైసీ వివరాలను పరిశీలించారు. సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించారు. పొదుపు ఖాతాలకు నామినీని తప్పక నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ రీజినల్ మేనేజర్ నితీన్, ఏజీఎం శ్రీహరి, ఎల్‌డీఎం సుశీల్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం రవీందర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, సత్యనారాయణ, బ్యాంకు అధికారులు రవి, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.



తోలుకట్ట శిబిరంలో మాట్లాడుతున్న సీజీఎం సహదేవన్‌రాధాకృష్ణన్

బాలిక కిడ్నాప్ కేసు విచారణ ముమ్మరం

పోలీసుల అదుపులో బాలిక, యువకుడు

బషీరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో బాలికను, ఆమెను వెంట తీసుకెళ్లిన యువకుడిని తాండూరు రూరల్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ కిడ్నాప్‌పై రూరల్ సీఐ నగేశ్ నేతృత్వంలో విచారణ చేస్తున్నారు. కిడ్నాప్‌నకు సంబంధించి వివరాలను సేకరించారు. మరింత విచారణ కోసం బాలికను పోలీసులు వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే తమ కూతురిని కిడ్నాప్ చేసిన యువకుడి కుటుంబీకులు కేసును నీరుగార్చేందుకు తమపై ఒత్తిడి తెస్తున్నారని బాలిక తల్లిదండ్రులు చెబుతున్నారు. బాలిక స్టేట్‌మెంట్ ప్రకారం కేసు సెక్షన్ల మార్పు యోచనలో పోలీసులున్నట్లు తెలుస్తోంది. దీనిపై బషీరాబాద్ ఎస్సై నుమాన్ అలీని స్పందన కోరగా.. బాలిక అపహరణపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, మహిళా స్టేషన్‌లో బాలికను విచారిస్తున్నారని తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

మేడ్చల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ పరిధి వినాయక్‌నగర్ రోడ్డు నంబర్ 1లో హోటల్ నిర్వాహకులు రోడ్డుకు ఆనుకొని నిర్మించిన కట్టడాలను గురువారం అధికారులు తొలగించారు. వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఇటీవల ప్రజలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి నిర్మాణాలను తొలగించారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ తెలిపారు.



బయోమెట్రిక్ హాజరు పకడ్బందీగా అమలు చేయాలి

తాండూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నేటి (ఆగస్టు 1) నుంచి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక యాప్ ద్వారా ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని కలెక్టర్ అమలు చేస్తున్నారు. జూలైలో ఇది ప్రారంభమైంది. ఈమేరకు ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోనే విధులు నిర్వహించేందుకు గానూ ఈ కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు ట్రైన్ సమయానికి బయల్దేరుతున్నామని బయోమెట్రిక్ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

అనురాగ్‌లో స్టూడెంట్ చాప్టర్


స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 120మంది విద్యార్థులతో పాటు పలు విభాగాల నిపుణులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు గ్లోబల్ అఫైర్స్ అఫీస్ డైరెక్టర్ అంకితాతు టేజా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో నిర్వహించే వర్క్‌షాప్‌లు, సదస్సుల్లో విద్యార్థులు పాల్గొని మేథాశక్తిని పెంచుకోవాలని సూచించారు. అంతర్జాతీయ ఉద్యోగ దరఖాస్తుల్లో తమను తాము సమర్థవంతంగా ప్రదర్శించడానికి విద్యార్థులు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిచుకొని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించిన జూబ్లీహిల్స్ పాఠశాల విద్యార్థులు

కీసర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం సీబీఎస్ఈ దేశ వ్యాప్తంగా నిర్వహించే క్రీడాపోటీల్లో నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ విద్యార్థులు వాలీబాల్‌లో తమసత్తా చాటారు. రెండు రోజులుగా నగరంలోని బండ్లగూడలోని నల్లా మల్లా రెడ్డి కళాశాలలో సౌత్‌జోన్ క్లస్టర్-7 అండర్-14 విభాగంలో దాదాపు దేశవ్యాప్తంగా 80టీమ్‌లు వాలీబాల్ పోటీలో పాల్గొన్నాయి. ఈమేరకు పోటీల్లో పాల్గొన్న జూబ్లీహిల్స్ విద్యార్థులు ప్రతిభను కనబర్చి తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కూమార్, వ్యాయమ ఉపాధ్యాయుడు మదు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

కీసర రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలో శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవం పూజలు గురువారం కనుల పండువగా ముగిశాయి. వార్షికోత్సవ పూజల్లో భాగంగా చివరి రోజు గురువారం గణపతి పూజ, రమాసహిత సత్యనారాయణ స్వామి వార్లకు విశేషంగా అభిషేకం, పూర్ణాహుతి, పుష్పాలంకరణతో పాటు దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. శ్రీసాయి పీఠం(సాయిధామం) గురూజీ రామానంద ప్రభూజి భక్తులనుద్దేశించి ప్రవచించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అన్నంరాజ్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు విరాళం


విరాళం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు మాజీ జెడ్పీటీసీ మధుకర్ రూ.51వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని పట్లూర్ గ్రామంలో ఈ నెల 3న జరిగే నూతన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తన వంతుగా గురువారం రూ.51వేలు విరాళాన్ని పట్లూర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందిరా, అశోక్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాయకులు రవి, అంజయ్య, రాజు, రమేశ్, మిత్ర, రవీందర్ పాల్గొన్నారు.

కవిత నిరాహార దీక్షకు మద్దతు

వికారాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లు సాధన కోసం నిస్వార్థంగా పోరాటం చేస్తున్న కవితకు సంఘీభావంగా 72గంటల నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూనైటెడ్ పూల్స్ ఫోరం కో కన్వీనర్ కీల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అతిథి గృహంలో వికారాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో ఆగస్టు 4, 5, 6తేదీల్లో చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా రాష్ట్రం నలుమూలల నుంచి బీసీ నాయకులు ముందుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, కవిత, పెద్ది అంజయ్య, దత్తాత్రేయ రావు, మనోజ్‌కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

కులకచర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో గురువారం లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ప్రజాప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్, షర్ఫోద్దీన్, అంబదాస్, రాములు పాల్గొన్నారు.

దోమ: అర్హులందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తుందని ఎంపీడీవో గ్యామా నాయక్, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు అన్నారు. దోమ మండలంలోని బొంపల్లి గ్రామంలో గురువారం లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీనాక్షి, డీలర్ నరేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు


కులకచర్ల చౌరస్తాలో పని చేయని సీసీ కెమెరాలు

కులకచర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కులకచర్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు చాలారోజుల నుంచి పనిచేయడంలేదు. గ్రామస్థులు, వాణిజ్య వ్యాపారస్తులు, ధాతల సహకారంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రధానంగా చిన్నగేటు, పెద్ద గేటు చౌరస్తాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. కాలక్రమేనా సీసీ కెమెరాలు మెయింటెనెన్స్ లేక పనిచేయడం లేదు. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడే విషయంలో పోలీసులకు సీసీ టీవీ ఫుటేజీలు ఎంతో దోహదపడతాయి. నిఘానేత్రాలు పనిచేయకపోవడంతో ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో బాధితులు, పోలీసులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల పుట్టపహాడ్ చౌరస్తాలో ఆకతాయిలు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. సీసీకెమెరాలు లేవనే ధైర్యంతో దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు విచారణ చేపట్టి ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు. సీసీ కెమెరాలు పని చేస్తే కేసు దర్యాప్తు సులువుగా మారేదని పలువురు అంటున్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా ఇప్పటికైనా వెంటనే కులకచర్లలో, పుట్టపహాడ్‌లో సీసీ కెమెరాలు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకం



నేరస్తులను పట్టుకోవడంలో సీసీకెమెరాల పాత్ర చాలా కీలకం. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానం. ప్రతీ గ్రామంలో వ్యాపార, వాణిజ్య, వర్తకులు, గ్రామస్థులు సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలు ఉండటంతో నేరాలను నియంత్రించేందుకు వీలుంటుంది. ఒక వేళ నేరం జరిగితే సీసీ ఫుటేజీ ఆధారంగా నేరస్తులను గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుంది.

- రమేశ్‌కుమార్, ఎస్ఐ, కులకచర్ల

డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు

కులకచర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల శ్రీ రామలింగేశ్వర కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఫస్టియర్‌లో చేరేందుకు ప్రవేశాలు జరుగుతున్నాయని కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఆగస్టు 13లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పైలట్ ప్రాజెక్టును పారదర్శకంగా అమలు చేయాలి

కొడంగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా డెయిరీ, షిప్ పార్మింగ్ పైలట్ ప్రాజెక్టును పారదర్శకంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ అన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అధికారులు బహిరంగంగా ప్రచురించకపోవడం, కొందరు రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఈ పథకాన్ని తమ అనుచరులకే పరిమితం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకుండా తప్పించుకోవడం సరైంది కాదన్నారు. మైనారిటీ లబ్ధిదారులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసీమ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ముస్తఫా, రఫీ, అయూబ్ పాష, హకీమ్, ఫర్హాద్ హుసేన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకూ 'ఎఫ్ఆర్ఎస్'

(ఐదో పేజీ తరువాయి)

విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యా శాఖ యాజమాన్య పరిధిలో కొనసాగుతున్న పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది వివరాలను గురువారం వరకు డీఎస్ఈ - ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే.

డుమ్మాలకు చెక్

తరచూ విధులకు అనధికారికంగా గైర్హాజరయ్యే ఉపాధ్యాయులకు ముఖ హాజరు విధానంతో చెక్ పడనుంది. మారుమూల గ్రామాలు, తండాల్లోని పాఠశాలల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నట్లు విద్యా శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటూ ఉంటే.. కొందరు ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించారు. పాఠశాలకు ఆలస్యంగా రావడం, సమయం ముగియక ముందే తిరుగుముఖం పట్టడం, విధులకు హాజరు కాకున్నా.. హాజరైనట్లు తర్వాత రోజు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయడం, కొన్నిచోట్ల తమకు బదులుగా వేరే వ్యక్తులతో చదువు చెప్పించడం వంటి ఉదంతాలను పరిశీలించిన విద్యా శాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకూ ముఖ హాజరు విధానం వర్తింపజేయాలనే నిర్ణయం తీసుకున్నారు. గతేడాది ఫిబ్రవరి నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న పెద్దపల్లిలో ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడినట్లు గుర్తించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉపాధ్యాయులకు హాజరు కోసం ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేయాలని విద్యా శాఖ భావించినా.. తుది నిర్ణయం తీసుకునేందుకు ఇంత సమయం పట్టింది.

లక్ష్యం నెరవేరేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఇప్పటివరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన దృశ్యాలు ఎక్కడా కనిపించకపోవడం విడ్డూరం.

లక్ష్యం 70లక్షల మొక్కలు

జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో 70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వన మహోత్సవంపై జిల్లా అధికారులు సమీక్షలు నిర్వహించి శాఖల వారీగా లక్ష్యాలు విధించారు. కానీ, ఏ శాఖ ఆధ్వర్యంలో కూడా వన మహోత్సవం నిర్వహించడం లేదు. నర్సరీల్లో మొక్కలు ఉన్నా.. ఏదో నామమాత్రంగా కొన్ని మున్సిపాలిటీల్లో మొక్కలు పంపిణీ చేయడం, అదనపు కలెక్టర్‌తో మొక్కలు నాటించి ఫొటోలు దిగడం వరకే కార్యక్రమం పరిమితం చేస్తున్నారు. ఇటీవల వారంపాటు ముసురు కురిసినా అధికారులు వన మహోత్సవం చేపట్టలేదు. అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో హరితహారం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించిన అధికారులు ఇప్పుడు మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఈ లెక్కన ఈ ఏడాది లక్ష్యం పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇప్పటికైనా వనమహోత్సవంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

జనహిత పాదయాత్రకు తరలిన నాయకులు


పూడూరు: రంగాపూర్ నుంచి పరిగి వరకు సాగిన యాత్రలో పూడూరు మండల కాంగ్రెస్ నాయకులు

పూడూరు, జూలై 31, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేపట్టిన మొదటి విడత జనహిత పాదయాత్ర గురువారం పరిగి మండలం రంగాపూర్ నుంచి ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. పాద యాత్రలో పూడూరు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీజనహిత పాదయాత్రతో పరిగి-కొడంగల్ చౌరస్తాలో దారిపొడవునా కిలో మీటరు మేరకు వాహనాలు నిలిచిపోయాయి.

దోమ: రంగాపూర్ నుంచి జనహిత పాదయాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబులకు స్వాగతం పలికేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. సాయంత్రం 5:35గంటలకు పాదయాత్ర ప్రారంభించి పరిగి పట్టణానికి చేరుకున్నారు. పాదయాత్రకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలి రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం పోలీసులు లైన్‌క్లియర్ చేయడంతో పాదయాత్ర ప్రారంభించారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు


కార్యక్రమంలో ఎంఈవో, ఉపాధ్యాయులు

కొడంగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎంఈవో రాంరెడ్డి అన్నారు. కొడంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు మురళీధర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు మురళీధర్ పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకిత భావంతో పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విజయరామారావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే


హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): తాండూరు పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తాండూరు అభివృద్ధికి సహకరిస్తానని తెలిపినందుకు గానూ గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తాండూరు అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించే విధంగా ప్రణాళికతో ముందుకెళ్లాలని వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలపడంతో పాటు తాండూరు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి

పెద్దేముల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బ్యాగరి యాదప్ప తన కుమారుడు వెంకటేశ్‌తో కలిసి వికారాబాద్ కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారి వారి పరిస్థితిని వివరించారు. తన కుమారుడికి 2001లో పెద్దేముల్ మండల కేంద్రంలోని పాడుబడిన ఇరిగేషన్ కార్యాలయంలో లభించిన డిటోనేటర్ పేలి రెండు కళ్లు పోయాయని చెప్పారు. గతంలో ఇళ్ల మంజూరైనా ఆర్థిక పరిస్థితి అనుకూలించక ఇళ్లు నిర్మించుకోలేదని చెప్పారు. అయినా తమపేరుపైన ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బిల్లులు తీసుకున్నారని వాపోయారు. తమకు ఇల్లు కావాలని అడిగితే ఇల్లు మంజూరు చేయడం లేదని చెప్పారు. తమకు ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు చేస్తే కట్టుకుంటామని చెప్పారు. అయితే గతంలో ఇల్లు మంజూరై కొంతమేర బిల్లుకూడా చెల్లించినందున అధికారులు ఆయన దరఖాస్తును రిజక్ట్ చేశారు.

సంక్షిప్తంగా..

సీపీఐ మహాసభలు విజయవంతం చేయండి

పెద్దేముల్: తాండూరులో ఆగస్టు 12న సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీపీఐ జెండాను ఆవిష్కరించి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

మేడ్చల్ టౌన్: ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని శ్రీరంగవరం మాజీసర్పంచ్ విజయేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శైలజ కూతురు తేజస్వినీరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 400మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను, గ్లాసులను పంపిణీ చేశారు.

అనారోగ్యంతో మాజీ ఉప సర్పంచ్ మృతి

నవాబుపేట: అత్తాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ నరేందర్‌గౌడ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో విద్యా మౌలిక వసతుల మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు స్వరూప, భీమయ్య, అమరేందర్‌రెడ్డి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు హెడ్‌ఫోన్స్ అందజేత

దోమ: అయినాపూర్ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనకు అవసరపడే హెడ్‌ఫోన్స్‌ను గ్రామస్తులు, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌బాబు గురువారం విద్యార్థులకు అందజేశారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడి ఎన్నిక

కోట్‌పల్లి: నాసన్‌పల్లి గ్రామ అధ్యక్షుడుగా మల్‌రెడ్డి, కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడుగా సంగమేశ్‌లను గురువారం ఏకగ్రీకంగా ఎన్నుకున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

దుద్యాల: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. హస్నాబాద్‌లోని తెలుగు వీధిలో గురువారం విద్యుత్ ట్రాన్స్‌పార్మర్, హనుమాన్ దేవాలయం, మత్స్యకారుల కార్యాలయం వద్ద హైమాస్ట్ లైట్స్‌ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామ ఆదర్శపాఠశాల, వసతి గృహాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌కు సన్మానం

పూడూరు: ఆత్మ కమిటీ పరిగి నియోజకవర్గ చైర్మన్‌గా మంచన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కక్కులూరి శ్రీనివాస్‌రెడ్డి తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు గురువారం శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కీసర రూరల్:మున్సిపల్ పరిధిలోని సాయిభవాని ఫంక్షన్‌హాల్‌లో గురువారం మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, ముప్పరామారావు పాల్గొన్నారు.

రేపు 'మహాగర్జన'కు తరలిరావాలి

కొడంగల్: దివ్యాంగులు, వృద్ధులు, వితంతు పింఛన్లను పెంచాలని శనివారం(రేపు) కొడంగల్ పట్టణంలోని మురారి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న మహాగర్జనకు తరలిరావాలని వీహెచ్‌పీఎస్ జాతీయ గౌరవ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు అన్నారు. కొడంగల్‌లో గురువారం దివ్యాంగుల, వృద్ధుల, వితంతువుల జిల్లా మహాగర్జన ప్రచార రథాలను ఆయన ప్రారంభించారు

యాలాల: మహాగర్జన సభకు తరలిరావాలని యాలాల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్ పిలుపునిచ్చారు. అచ్యుతాపూర్‌లో పెన్షన్ దారులతో గురువారం సమావేశం నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని శ్రీగోదా సమేత మన్నార్ రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం స్వామివారి ఘటాభిషేకం మహదాశీర్వచనంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లకు గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. దేవరయాంజాల్‌కు చెందిన పసరి పుష్పమ్మ రూ.12,28,429 ఇంటి పన్నును చెల్లించారు. ఆర్వో అర్షద్ అహ్మద్, వార్డు ఆఫీసర్ మహేందర్, బిల్‌కలెక్టర్ రామ్‌రెడ్డిలను కమిషనర్ అభినందించారు.

క్రైం కార్నర్

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు


పోలీసుల అదుపులో ఇద్దరు బైక్ దొంగలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన బైక్‌లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు బైక్‌దొంగలను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంటకు చెందిన చింతల మహేశ్(20), రామగల శ్రీధర్(20)లు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా బైక్‌లు తనిఖీచేసి అదుపులోకి తీసుకొని విచారించారు. ఈనెల ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, పరిధి ఘనాపూర్‌లోని ఐశ్వర్య హాస్టల్ ఎదుట పార్కు చేసిన బైక్‌ను, భువనగిరి టీటైం వద్ద పార్క్ చేసిన మరో బైక్‌ను అపహరించుకెళ్లినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు బైక్‌లను స్వాధీనం చేసుకొని మహేశ్, శ్రీధర్‌లను రిమాండ్‌కు తరలించారు. వీరిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

కులకచర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి పారిపోయిన బాలుడిని ఉపాధ్యాయులు పోలీసులకు అప్పగించారు. కులకచర్లకు చెందిన గుడిసె మయూరి కుమారుడు అఖిల్(10) ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ అక్కడే బీసీ వసతి గృహంలో ఉంటున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్లి విశ్రాంతి సమయంలో బయటకు వెళ్లాడు. చౌరస్తాలో బస్సు ఎక్కి షాద్‌నగర్‌కు వెళ్లి అక్కడ బస్టాండ్‌లో తిరుగుతుండగా ఆర్టీసీ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రఫీ రాత్రికి కులకచర్లకు తీసుకురాగా అదే రాత్రి ఇంటి నుంచి బాలుడు తిరిగి పారిపోయాడు. గ్రామంలోని ఓఆటోలో నిద్రించి గురువారం ముజాహిద్‌పూర్ గేటు సమీపంలో కనిపించగా గమనించిన స్థానికులు హెచ్ఎం సతీశ్‌కుమార్‌కు సమాచారం అందించారు. బాలుడిని పట్టుకొని ఎంఈవో హబీబ్ అహ్మద్ సమక్షంలో కులకచర్ల పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసులు బాలుడిని తల్లి మయూరికి అప్పగించారు. బాలుడి వద్ద రూ.900 ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

బషీరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని మాసన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, శాంతమ్మ కుమారుడు గౌతమ్(23), మమబూబ్‌నగర్ జిల్లా నంచర్లకు చెందిన మౌనిక(19) కొంతకాలంగా ప్రేమించుకున్నారు. అదే ఊరిలో అమ్మమ్మ వద్ద ఉంటున్న గౌతమ్, మౌనికను వెంట తీసుకుని బుధవారం స్వగ్రామానికి వచ్చారు. గ్రామ సమీపంలోని కొర్విచెడ్ వద్ద శివాలయంలో పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో యువతి కుటుంబీకుల నుంచి యువకుడికి బెదిరింపులు రావడంతో పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. విచారణ చేపట్టిన ఎస్ఐ నుమాన్‌అలీ ఇరు కుటుంబాలు కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇరు కుటుంబాల పెద్దలు సమావేశమై మాట్లాడుకుని ప్రేమ జంటను ఆశీర్వాదించి వెళ్లినట్లు అక్కడికి వచ్చిన పెద్దలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దోమ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బాసుపల్లికి చెందిన హరీశ్వర్‌రెడ్డి బైక్‌పై బొంపల్లి గ్రామానికి గురువారం వెళ్తున్నాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో బాసుపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి పరిగికి వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో హరీశ్వర్‌రెడ్డికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌కు తరలించారు.

లారీ ఢీకొని కమాన్ కూలడంపై ఫిర్యాదు

శామిర్‌పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఆలయ కమాన్ కూలడంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుర్తుతెలియని లారీ ఢీకొట్టి అలియాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ కమాన్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో గ్రామస్తులు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులు వెంటనే కమాన్‌ను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు కొట్టివేత

కొడంగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొడంగల్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలులో రైతుల డబ్బులు కాజేశారని, అవినీతి, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు అప్పట్లో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న నాయకులపై కేసులు నమోదు కావడంతో విచారణ ఎదుర్కొంటున్నారు. గురువారం కొడంగల్ మున్సిఫ్ కోర్టు వారిపై ఉన్న కేసును కొట్టివేసింది. కేసులు నమోదైన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.యూసుఫ్, ప్రశాంత్, కృష్ణంరాజు, రెడ్డిశ్రీనివాస్, వెంకట్ రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

బషీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నవాల్గ పీహెచ్‌సీ వైద్యులు గోపాల్ నేతృత్వంలో వైద్య సిబ్బంది పలువురు శిబిరానికి హాజరై 95విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కొందరు విద్యార్థులకు జ్వరం ఉన్నట్లు గుర్తించిన వైద్యులు వారి శాంపుల్స్ తీసుకున్నారు. మరికొందరు తలనొప్పి, దురద ఉండటంతో మందులు, ఆయింట్‌మెంట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

మేడ్చల్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ కోరారు. ఈ మేరకు గురువారం బీజేపీ నాయకులతో కలిసి ఆమె మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాశ్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ పట్టణంలోని కాలనీల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ భూగర్భ జలాలు సరిగా లేక బోర్లు ఎండి పోయాయన్నారు. పారిశుద్యం లోపించి పలు వార్డుల్లో విషజ్వరాలు ప్రబలే ప్రమాదముందన్నారు. సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

మర్పల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఐఏఎస్ జయేశ్‌రంజన్ అన్నారు. పట్లూర్‌లో పవర్ మేక్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ తమ సెంటర్‌లో వెల్డింగ్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, కన్‌స్ట్రక్షన్, హెల్పర్స్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు వసతి, భోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. 33 నుంచి 90రోజుల వరకు శిక్షణ ఉంటుందని, 8వ తరగతి పాస్ అయి ఉండి ఐటీఐ లేదా ఇంటర్ పాస్ అండ్ ఫెయిల్ అయిన వారు అర్హులు అని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మి, ఫౌండేషన్ అధినేత కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ విమల్‌కుమార్, నందకిషోర్ పాల్గొన్నారు.